క్లుప్తంగా

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు

గూడూరు: వర్షాలకు గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు పంప్ ఆపరేటర్లను ఆదేశించారు. మండలంలోని చిట్టిగూడూరు, తరకటూరు, మద్దిపట్ల, కంచాకోడూరు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎంపీడీఓ రక్షిత నీటి పథకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి, కంచాకోడూరు సర్పంచి కోళ్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవలపై అవగాహన

గూడూరు: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే న్యాయ సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య కోరారు. కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మంగళవారం మల్లవోలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

నీటి తీరువా వసూళ్లలో వేగం పెంచాలి

ఘంటసాల: నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని మచిలీపట్నం ఆర్డీవో వాణి అధికారులను ఆదేశించారు. ఘంటసాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో వాణి మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ భవనాన్ని పరిశీలించి సౌకర్యాలను తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రూ.1.27 కోట్ల నీటి తీరువా వసూళ్లు కావాల్సి ఉండగా రూ.27 లక్షల మాత్రమే వసూళ్లు అయ్యాయని, మిగిలిన బకాయిలు కూడా రైతులతో మాట్లాడి వేగవంతంగా వసూలయ్యేలా చూడాలని ఆర్డీవో.. తహసీల్దార్, సిబ్బందికి తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలు

గూడూరు: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాల కారణంగా నీటి ముంపునకు గురైన పంటలకు తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గూడూరు వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని గూడూరు, తుమ్మలపాలెం, తరకటూరు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన శివప్రసాద్ రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం నీటిలో ఉన్న పంట బయట పడిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ కలిపి చల్లాలని ఆయన సూచించారు.

నాగాయలంక: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నాగేంద్ర, డాక్టర్ లహరి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత మంగళవారం మండలంలో పర్యటించి అధిక వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. ప్రాథమిక అంచనా మేరకు 3770 ఎకరాల్లో వరి ముంపునకు గురైందన్నారు.

లంకపల్లి(ఘంటసాల): పొలాల్లో ఉన్న వర్షం నీరు తక్షణమే బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు రైతులకు తెలిపారు. ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ పర్యవేక్షణలో శాస్త్రవేత్తల బృందం నీట మునిగిన పంట పొలాలను మంగళవారం పరిశీలించింది. కార్యక్రమంలో మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, ఘంటసాల ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ లహరి, వీఏఏ ఎ.యువశ్రీ, రైతులు గువ్వాబత్తిన నాగేశ్వరరావు, మండవ గోపాలకృష్ణ, ఇతర రైతులు పాల్గొన్నారు.

కోడూరు: భారీ వర్షాలు, వరదల కారణంగా మునగబారిన పంటపొలాలను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. మండలంలోని నరసింహపురం, విశ్వనాథపల్లి, జరుగువానిపాలెం ప్రాంతాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించారు. పిలక దశలో సాధారణ వరివండిగాలకు ఐదు రోజుల పాటు నీటిలో ఉన్నా కూడా ఏవిధమైన నష్టం ఉండదని శాస్త్రవేత్త నాగేంద్ర చెప్పారు. పాథాలజీ శాస్త్రవేత్త డాక్టర్ లహరి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీలత, ఏడీఏ జయప్రద, ఏఓ శ్రీధర్, వీఏఏలు పాల్గొన్నారు.

ముంపులో పంట పొలాలు

- డ్రెయిన్లలో ముందుకు సాగని ప్రవాహం
- ప్రాథమిక అంచనాలు పంపిన వ్యవసాయ శాఖ అధికారులు


పెడన మండలం నందిగామలో ముంపులోనే పంట పొలాలు

పెడన: నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో పంట పొలాలు ఇంకా ముంపులో ఉన్నాయి. కొన్ని డ్రెయిన్లలో పూడిక తీసినా మరికొన్ని చోట్ల తీయకపోవడం, గుర్రపుడెక్క, తూటు అడ్డుగా ఉండటంతో పాటు సముద్రం నుంచి నీరు ఎదురుతన్నడంతో త్వరితగతిన డ్రెయిన్లలో నీరు బయటకు పోని దుస్థితి ఏర్పడింది. పొల్లాల్లోనే వర్షం నీరంతా నిల్వ ఉంటోంది. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 2,990 హెక్టార్లలో(7,475 ఎకరాలు), వేరుశెనగ 70 ఎకరాల పంట ముంపులోనే ఉందని వ్యవసాయ శాఖాధికారులు గుర్తించి నివేదికలను పంపించారు.

'పెడన'లో

పెడన మండలంలోని ఎనిమిది రెవెన్యూ పంచాయతీల పరిధిలో 600 ఎకరాలు ముంపులో ఉంది. ముచ్చర్ల, కొప్పల్లి, నందిగామ, కొంకేపూడి, పెనుమల్లి, చోడవరం, చేవేంద్ర, ఉరివి గ్రామాల్లో పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. గూడూరు మండలంలో 4,625 ఎకరాలు ముంపులో ఉండగా బంటుమిల్లిలో 1,250 ఎకరాలు, కృత్తివెన్నులో వెయ్యి ఎకరాలు ముంపులో ఉన్నాయని నివేదికలను పంపించారు. ఈ అంచనాలు రెండు, మూడు రోజులు గడిస్తే మార్పులుంటాయని వ్యవసాయశాఖాధికారులంటున్నారు. నీరు తగ్గితే పంట నష్టం ఎకరాలు తగ్గుతాయని, ఒక వేళ తగ్గకపోతే అంచనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

అవనిగడ్డ: వరద ఉధృతి కొద్దిగా తగ్గింది. పులిగడ్డ అక్విడెక్టు మాత్రం ఇంకా వరద నీటిలోనే ఉంది. ఈ ప్రాంతంలో 25 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. అవనిగడ్డ మండల పరిధిలోని పాత ఎడ్లంక, పులిగడ్డ, పల్లెపాలెం, రేగుల్లంక, వసుమట్ల, దక్షిణ చిరువోలులంక, చల్లపల్లి మండలం ఆముదార్లంక, మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. సోమవారం కంటే మూడడుగులు వరద తగ్గినప్పటికీ ఇంకా ఆయా గ్రామాల్లోని గృహాలు వరద నీటిలోనే మునిగి ఉన్నాయి. మోపిదేవి, కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం అత్యధికంగా 11.41 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయగా, మంగళవారం సాయంత్రం 6 గంటలకు 7.25 లక్షల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. సోమవారం రాత్రి 12 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుందనే హెచ్చరికలతో దివి సీమలోని చాలా గ్రామాల ప్రజలు బలహీనంగా ఉన్న కరకట్టల వద్ద పహారా కాశారు.

కోడూరు: ఉల్లిపాలెం వద్ద ప్రమాదకరంగా మారిన కృష్ణా కరకట్ట, నిండుకుండలా మారిన డ్రెయిన్లను పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు.

పొలాల్లో నీరు బయటకు పోవడానికి చర్యలు

పెడన: ముంపు బారిన పడిన పంట పొలాల్లో నిలిచిన వర్షం నీరు బయటకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ డ్రెయినేజీ అధికారులను ఆదేశించారు. ఆయన మండలంలోని ఉరివి, చెన్నూరు, నరసప్ప చెరువు, కమలాపురం, చేవేంద్ర, ముచ్చలిగుంట, నడుపూరు, నందిగామ, బల్లిపర్రు గ్రామాల్లో మంగళవారం పర్యటించి ముంపులో ఉన్న పంట పొలాలను, డ్రెయిన్లను పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, శీరంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): వరద ముంపునకు గురైన పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగేంద్ర, కేవీకే ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీలత, డాక్టర్ లహరి మంగళవారం పరిశీలించారు. రైతులంతా ఈ విపత్తును ఎదుర్కొవాలని, ధైర్యంగా ఉండాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

కోడూరు: దివిసీమలోని వరి పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కృష్ణానదికి వచ్చిన భారీ వరదతో పాటు అమావాస్య కారణంగా సముద్రం ఎగతట్టడంతో డ్రెయిన్లలో నీరు దిగువకు పారే పరిస్థితి లేదు. కోడూరు మండలంలోని నరసింహపురం, పిట్టల్లంక, విశ్వనాథపల్లి, దింటిమెరక, లింగారెడ్డిపాలెం, చినగుడుమోటు, జరుగువానిపాలెం , మందపాకల గ్రామాల్లో వరి పొలాలు నీటిలో నానుతున్నాయి. భారీ వర్షం కురవడంతో పొలాల్లో గట్లపై నుంచి నీరు ప్రవహించింది.

-వరద నీటి ప్రవాహం అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ద్వారా గ్రామాల్లో చొచ్చుకు వస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉల్లిపాలెం, పాలకాయతిప్ప గ్రామాల వద్ద లింగన్నకోడు డ్రెయిన్‌పై ఉన్న రెండు అవుట్‌పాల్ స్లూయిస్‌లను మూసివేశారు. ఉధృతి తగ్గే వరకు స్లూయిస్‌లు మూసే ఉంటాయని డ్రైనేజీ అధికారులు స్పష్టం చేశారు.

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం వద్ద మంగళవారం సాయంత్రానికి ఐదు అడుగుల మేర వరద తగ్గిందని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు.

నాలుగు రోజులైనా ఎక్కడ నీరు అక్కడే

బంటుమిల్లి: వాయుగుండం ప్రభావంతో వానలు కురిసి నాలుగు రోజులవుతున్నా ఎక్కడ నీరు అక్కడే ఉంది. నాగేశ్వరరావుపేట మైనర్ డ్రెయిన్‌లో తూతూ మంత్రంగా తూటు, జమ్ము తొలగించిన కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేయడంతో స్థానిక బీసీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగేశ్వరరావుపేట, బంటుమిల్లి, పెందుర్రు మైనర్ డ్రెన్లలోని అడ్డంకులు తొలగిస్తేనే బంటుమిల్లి గ్రామంతోపాటు వందలాది ఎకరాల్లో నిలిచిన మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం లేదు. పెందుర్రు మైనర్ డ్రైన్ సరిహద్దుగా ఉన్న జగనన్న మోడల్ కాలనీలో దాదాపు రెండు అడుగులకు పైగా వరద నీరు నిలిచి ఉంది. బంటుమిల్లి గ్రామంతోపాటు, నాగేశ్వరరావుపేట, పెందుర్రు మైనర్ డ్రెయిన్లను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు, తహసీల్దార్ భరత్‌రెడ్డి పరిశీలించారు.

అవనిగడ్డ: పునరావాస కేంద్రంల్లోని పిల్లలకు బొండాడ కంపెనీస్ సీఎండీ డాక్టర్ బొండాడ శ్రీనివాస్ బిస్కెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. పులిగడ్డ గురుకుల పాఠశాలలో ఉన్న పునరావాస కేంద్రంలో ఉన్న 240 మంది పిల్లలకు అవనిగడ్డ రెడ్‌క్రాస్ ఛైర్మన్ వంగర శేషగిరిరావు అందించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్, అవనిగడ్డ హైస్కూల్ పీడీ అమ్ముల భానుప్రకాష్‌తో తదితరులు పాల్గొన్నారు. మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోని పలు పునరావాస కేంద్రాల్లోని బాధితులకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ ఆహార పొట్లాలు అందించారు. బొబ్బర్లంక బాధితులకు బిస్కెట్లు, రొట్టెలు అందించారు.


నీలిపూడిలో చేనులో నీటిని ఆయిల్ ఇంజన్‌తో బయటకు తోడుతున్న రైతు

రైతుకు కన్నీటి కష్టం

కృత్తివెన్ను: వర్షం కారణంగా రైతన్నలకు కన్నీటి కష్టం వచ్చి పడింది. నిన్నటి వరకు సాగుకు నీరు లేక ఆయిల్ ఇంజిన్‌లతో సేద్యం కోసం రైతులు నీటిని తోడుకున్నారు. నేడు వర్షాల కారణంగా మునిగిపోయిన చేలల్లో నీటిని బయటకు తరలించడానికి తిరిగి అదే ఆయిల్ ఇంజిన్లపై ఆధారపడాల్సి వచ్చింది. కృత్తివెన్ను మండల వ్యాప్తంగా ప్రస్తుతం వర్షాల వల్ల దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా వరిచేలు నీటమునిగిపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు ఏవో ఎస్. జెన్నీ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అల్లాడుతున్న మూగజీవాలు

అవనిగడ్డ: వరద కారణంగా మేత దొరక్క దివిసీమలో మూగజీవాలు అల్లాడుతున్నాయి. మూడు రోజుల నుంచి మేత లభించక పోవడంతో మూగ రోదన అనుభవిస్తున్నాయి. అవనిగడ్డ మండలంలోని దక్షిణ చిరువోలులంక, ఎడ్లంక, పులిగడ్డ రేగుల్లంక, పల్లెపాలెం, వసుమట్ల, మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాలకు వరద నీరు ముంచెత్తడంతో మూగ జీవాలను గ్రామాల్లోనే వదిలేశారు. ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లో కొన్ని పశువులను కట్టేయగా, మరికొన్నింటిని తమ ఇళ్లలో కట్టేశారు. అవనిగడ్డ, మోపిదేవి, నాగాయలంక మూడువేల పశువులు, 1500 వరకూ మేకలు, గొర్రెలు ఉన్నాయి. ఈ మూడు రోజుల నుంచి వీటికి మేత దొరక్క, నీరు లభించక పోవడంతో అల్లాడిపోతున్నాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉండటంతో పశువులు, మేకలు, గొర్రెలు ఏమై పోతాయో తెలియక పశుపోషకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


ఎడ్లంకలో మేత కోసం ఎదురు చూస్తున్న మేకలు


పులిగడ్డ అక్విడెక్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు


పెదకళ్లేపల్లిలో.. వరద నీటిలో అరటి తోట


నరసింహపురం సమీపంలో చెరువులను తలపిస్తున్న పొలాలు

బుడమేరుకు గండి!

- ప్రమాదకరంగా బంటుమిల్లి కెనాల్
- పెడన మండల పరిసర ప్రాంతాల్లో గండ్లు పడే అవకాశాలు

పెడన: బుడమేరుకు గండి పడటంతో ఆ నీరంతా రైవస్‌కాలువ మీదుగా కోమటగుంట లాకులకు చేరుకుని అక్కడ నుంచి గుడ్లవల్లేరుకు చేరుతోంది. ఇక్కడ మూడు కాలువలుగా చీలి ఒక కాలువ బంటుమిల్లి కెనాల్ ద్వారా నీరు కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం వరకు ప్రవహించి ఉప్పుటేరులో కలుస్తోంది. అయితే గుడ్లవల్లేరు నుంచి బంటుమిల్లి కెనాల్ వెన్నంటే ఉన్న కాలువ గట్లు పెడన మండలంలో బాగా బలహీనంగా ఉండటంతో రైతులు బిక్కుబిక్కు మంటున్నారు. ఇప్పటికే బంటుమిల్లి కెనాల్‌లో పరిసర ప్రాంతాల్లోని పంటల్లోని నీరంతా బంటుమిల్లి కెనాల్‌లో చేరి మూడు నుంచి ఆరు అడుగులు వరకు నీరు ప్రవహిస్తోంది. అంటే సుమారు 600 నుంచి 700 వరకు క్యూసెక్కులు నీరు ప్రవహిస్తోంది. బుడమేరు ద్వారా వచ్చే వరద నీరు కాస్తా రైవస్ కాలువ మీదుగా బంటుమిల్లి కెనాల్‌కు చేరితే బలహీనంగా ఉన్న కాలువ గట్లు వద్ద గండి పడే ప్రమాదం పొంచి ఉంది. విషయం తెలిసి ఇరిగేషన్ అధికారులు రైతులు సహకారంతో బలహీనంగా ఉన్న గట్ల వద్ద తాత్కాలికంగా మట్టి బస్తాలతో మరమ్మతులు చేశారు. అవి ఎంత వరకు తట్టుకుని నిలబడతాయనే విషయంలో రైతులు, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. దీనిపై ఇరిగేషన్ ఈఈ కొడాలి బాబు మాట్లాడుతూ బంటుమిల్లి డెల్టా కాలువకు నీటి సరఫరా నిలుపుదల చేశామని, ప్రస్తుతం కాలువల్లో వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందన్నారు. బుడమేరు గండి ద్వారా వస్తున్న వరదనీటితో బంటుమిల్లి కెనాల్‌కు ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. ఆ స్థాయిలో నీటిని కూడా వదిలిపెట్టమని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.


బలహీనంగా బంటుమిల్లి కెనాల్ గట్టు

పేర్ని నాని కారు అద్దాలు పగలకొట్టిన ఘటనపై కేసు

చిలకలపూడి(మచిలీపట్నం): మాజీ మంత్రి పేర్ని నాని కారు అద్దాలు పగలకొట్టిన సంఘటనపై మంగళవారం మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేర్ని నాని కారు డ్రైవర్ ఎస్‌కే యాకూబ్ ఫిర్యాదు చేశారని ఆదివారం గుడివాడ పట్టణంలో తోట శివాజీ నివాసంలో పేర్ని నాని మాట్లాడుతుండగా డ్రైవర్ యాకూబ్ మీదకు జనసేన నాయకులు దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. బొమ్ములూరు వద్ద కారు ఉన్నప్పుడు ఎనిమిది మంది జనసేన కార్యకర్తలు వచ్చి కారు అద్దాలు పగలకొట్టారని తెలిపారు. యాకూబ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి గుడివాడ తాలుకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు రక్షణ కావాలి

కృత్తివెన్ను: మహిళల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు రావాలని, పనిచేసే ప్రతి చోట మహిళలకు రక్షణ కావాలని కృత్తివెన్ను పీహెచ్ పరిధిలోని ఆశావర్కర్లు నిరసన తెలిపారు. వీరంతా మంగళవారం కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యులు సాయిసందీప్‌కు వినతిపత్రం ఇచ్చారు. కోలకతాలో వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని వారు నిరసిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు పెంచాలని, ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని 60 సంవత్సరాలు నిండిన ఆశాల రిటర్మెంట్‌ను జీవోలు విడుదలయ్యే వరకు ఆపాలని వినతిపత్రంలో కోరారు. నిరసనలో సీఐటీయూ నేత మాజేటి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, కనకకుమారి, మాధవి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. గండం గడిచింది

కోడూరు: భారీ వరద దివిసీమ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేసింది. ప్రకాశం బ్యారేజీ వద్ద విడుదల చేసిన నీరు హంసల దీవి వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే అమావాస్య కావడం.. పోటు ఎగతట్టడంతో కృష్ణమ్మ మరింత ఉగ్రరూపం దాల్చింది. వరద నీరు సముద్రంలోకి నెమ్మదిగా వెళ్లడంతో కృష్ణాకట్టపై పెనుభారం పడింది. హంసలదీవి, ఉల్లిపాలెం సమీపంలో నదికి భారీ మలుపు ఉండడంతో వరద నీరు వచ్చి కరకట్టను బలంగా తాకాయి. ఇక్కడ బలహీనంగా ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారింది. కరకట్టకు సంబంధించిన మట్టి అండలు నదిలో పడిపోయాయి. కరకట్ట కేవలం అడుగున్నర మాత్రమే వెడల్పు మాత్రమే ఉంది. అయితే ఇరిగేషన్, రెవిన్యూ, డ్రైనేజీ, పంచాయతీరాజ్, ఫిషరీస్ అధికారులు సమన్వయంతో పని చేసి గండి ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. గంటల వ్యవధిలో కరకట్టను ఆనుకొని సుమారు 150 మీటర్ల మేర మరో కట్ట నిర్మించారు. కోత ప్రాంతంలో బాదులు, తడికలతో పటిష్ట చర్యలు చేపట్టారు. వరద తగ్గుముఖం పడుతుందని ఆదేశాలు వచ్చినా మంగళవారం మధ్యాహ్నం వరకు అధికారులు కరకట్ట పరిస్థితిని పర్యవేక్షిస్తూనే వచ్చారు. నది ఉధృతి తగ్గడంతో గండం గడిచిందని అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


కరకట్ట వద్ద యుద్ధప్రతిపాదికన మరో కట్ట నిర్మాణం పనులు

రైతాంగాన్ని ఆదుకోండి

- తక్షణం నష్టపరిహారం ప్రకటించండి
- అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

చోడవరం(నాగాయలంక): అధిక వర్షాలకు మండలంలో రైతులను ఆదుకోవాలని తక్షణం నష్ట పరిహారం ప్రకటించాలని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. నాట్లు వేసిన పొలాలు ఇంకా 40 శాతం నీటిలోనే మునిగి ఉండటంతో పైరు పాచిపోయి కుళ్లిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపార్టీ జిల్లా రైతు నేత కడవకొల్లు నరసింహారావుతో కలసి మంగళవారం నాగాయలంక మండలం చోడవరం పర్ర ప్రాంతంలో పర్యటించారు. పొలాల్లో దిగి నీటిలో మునిగిపోయి కుళ్లిపోతున్న వరి నారును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం కారణంగానే విజయవాడ నగరంలో వాడవాడలా ప్రజలు నరక యాతన పడుతున్నారని రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన కరకట్ట కింద సీఎం చంద్రబాబు నివాసానికి వెన్నుదన్నుగా ఉండటానికి అధికార యంత్రాంగం వరదనీటి నియంత్రణ సక్రమంగా అమలు చేయలేదని దీంతో విజయవాడ ప్రజలకు కోలుకోలేని నష్టం సంభవించిదన్నారు. చోడవరం సర్పంచ్ కైతేపల్లి రాజేంద్ర, పార్టీ మండల నేతలు మద్ది చిన్నారి, తోట సాయిబాబు, బీసాబత్తుని ప్రసాద్, బీమా బాబూరావు, మద్ది కొండలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■లాకుల రక్షణకు ఐదు గ్రామాల ప్రజల కృషి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): కృష్ణా నదికి వచ్చిన వరదనీటి నుంచి గ్రామాలను కాపాడటానికి ఐదు లంకగ్రామాల ప్రజలు మూడు రోజులుగా తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రధానంగా కరకట్టకు ఏర్పాటు చేసిన లాకులు పనిచేయక పోవడంతో వాటి వద్ద ఇసుక మూటలు వేసి సోమవారం తెల్లవార్లూ గ్రామస్తులు కాపలా కాశారు. కోసూరువారిపాలెం నుంచి ఉత్తరచిరువోలులంక సుమారు 300 అడుగుల దూరం కరకట్టపై పెద్ద గోతులు పడటంతో పాటు కిందకు కుంగి వరద నీరు కరకట్టపైకి చేరింది. గ్రామస్తుల సహకారంతో అధికారులు కరకట్ట పొడవునా ఇసుకమూటలు, 150 ట్రక్కుల మట్టి వేసి వరద ముంపు నుంచి గ్రామాలను కాపాడుకున్నారు. అర్ధరాత్రి స్థానిక ఎమ్మెల్యే తనయుడు వెంకట్రామ్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు.

■కేఈబీ కేనాల్‌పై గేటుకు మరమ్మతులు

మోపిదేవివార్పు(మోపిదేవి): అక్విడెక్ట్ కెఈబీ కెనాల్‌పై నిర్మించిన ఎల్ఎఫ్ఆర్ గేటు శిథిలం కావడంతో వరద నీరు రాతి కాలువ మీదుగా దెబ్బతిన్న గేట్ నుంచి కేఈబీ కేనాల్‌లోకి ఎదురు చేరుతోంది. దీంతో ఎల్ఎఫ్ఆర్ గేటు ప్రమాదంలో పడింది. రెండు రోజులుగా కృష్ణానది దిగువకు వస్తున్న వరద కేఈబీ కెనాల్ ద్వారా ఎగదట్టి మోపిదేవివార్పు వద్ద పంట పొలాలు, ఇళ్లల్లోకి చేరుతోంది. రైతులు, గ్రామస్తుల ఆందోళనతో స్పందించిన అధికారులు మంగళవారం దెబ్బతిన్న గేటుకు మరమ్మతులు చేపట్టారు.

■ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా రామారావు సేవలు ఆదర్శనీయం

ఘంటసాల: ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా జొన్నలగడ్డ రామారావు అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జొన్నలగడ్డ రామారావు పదవీ విరమణ చేయగా హైస్కూల్లో మంగళవారం పదవీ విరమణ అభినందన సభ హెచ్‌ఎం శ్రీరంగవల్లి అధ్యక్షతన నిర్వహించారు. ఘంటసాల హైస్కూల్ విద్యా కుటుంబంతో పాటు పలువురు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు శాలువాలు కప్పి, వస్త్రాలు అందజేసి రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, ఎంఈవోలు 1, 2 ఎన్.శివశంకరరావు, ఎండీ మోమిన్, శ్రీకాకుళం హైస్కూల్ హెచ్‌ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి పాల్గొన్నారు.

■అధికారులూ అప్రమత్తంగా ఉండండి

పాపవినాశనం(ఘంటసాల): కృష్ణా నది వరద పూర్తి స్థాయిలో తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మచిలీపట్నం ఆర్డీవో వాణి అన్నారు. ఘంటసాల మండలంలోని పాపవినాశనం, శ్రీకాకుళం గ్రామాల్లో కృష్ణానది వరద ఉధృతిని మంగళవారం సాయంత్రం ఆర్డీవో వాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో ఏమేమి పంటలు ఉన్నాయి, ఎంత వరకు నష్టం జరిగి ఉంటుంది తదితర వివరాలను స్థానిక రైతులతో పాటు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ చప్పిడి చిట్టిబాబు, వీఆర్వో బత్తుల శివప్రసాద్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

■వరద బాధితులకు పులిహోర ప్యాకెట్లు

కె.కొత్తపాలెం(మోపిదేవి): కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవివార్పు వద్ద వరద బాధితులకు పలు స్వచ్ఛంద సంస్థలు పులిహోర, బిర్యానీ రైస్ మంగళవారం అందించారు. పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం 1,000 పులిహోర ప్యాకెట్లు వరద బాధితులకు పంపిణీ చేశారు. సాయంత్రం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి పులిహోర, వాటర్‌ప్యాకెట్లు పంపారు.

■కృష్ణమ్మా.. శాంతించమ్మా



నాగాయలంక: గతంలో ఎన్నడూ లేని రీతిలో కృష్ణ వరద పోటెత్తింది. వరద తగ్గుముఖం పట్టడంతో ఇకనైనా శాంతించమ్మా కృష్ణమ్మా అంటూ మంగళవారం స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణా నదికి శాంతి పూజలు చేశారు. టీడీపీ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత నేతృత్వంలో గ్రామ మహిళలు పలువురు నదికి తొలుత శాస్త్రోక్తంగా శాంతి పూజ జరిపించారు. సోమవారం సాయంత్రం నుంచి అనేక పరిసర గ్రామాల మహిళలు వరదను సందర్శించి నదిలో పసుపు, కుంకుమ, పూలు సమర్పించి నమస్కరించి వేడుకుంటున్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళంలో కృష్ణానది వద్ద గ్రామస్తులు శాంతించమ్మ కృష్ణమ్మ అంటూ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

నాగాయలంక: వరద నేపథ్యంలో మచిలీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.జ్యోతిర్మయి మంగళవారం నాగాయలంకలో పర్యటించి సూపర్ శానిటేషన్ పనులు స్వయంగా పరిశీలించారు. ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి జె.హెచ్.వి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రాత్రంతా కరకట్టపైనే..!

కోడూరు: వరద నుంచి తమ గ్రామాలను కాపాడుకొనేందుకు నది పరీవాహక ప్రజలు సోమవారం రాత్రంతా కరకట్టపైనే గడిపారు. వరద నీరు దివిసీమ ప్రాంతానికి అర్ధరాత్రి ఒంట గంట సమయంలో చేరడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. కోడూరు మండలంలోని విశ్వనాథపల్లి, సాలెంపాలెం, పిట్టల్లంక ప్రాంతాల్లో గ్రామస్తులు స్వచ్ఛందంగా సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరద నీరు ఊళ్లలోకి చొచ్చుకు రాకుండా సుమారు మూడు అడుగులు మేర ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు తీసుకున్నారు. ప్రమాద తీవ్రత తగ్గిందని అధికారులు ప్రకటించిన తర్వాత విశ్వనాథపల్లి, సాలెంపాలెం, పిట్టల్లంక గ్రామాల ప్రజలు వారి ఇళ్లకు వెళ్లారు. మంగళవారం సాయంత్రానికి రెండు అడుగుల మేర వరద తగ్గిందని, పూర్తిస్థాయిలో తగ్గడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ రెండు రోజులూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైక్ ప్రచారం చేశారు.